'సంబంధంయేముంది గాలిపతాలసంబంధంతప్ప' అన్నాడు నవ్వుతూ.

# గాలిపతాలసంబంధం

చిన్నకథ :

నలుడికి దమయంతికి హంస వివాహసంధానంచేస్తే
శాంతకు శంకర్రావుకి గాలిపతం వివాహసంధానం చేసింది.

రచయిత :


## కాంచనపల్లి వెంకటరంగారావు

('నవ్వులతోట' ప్రకాశకులు—'సరస్వతీ' చిత్రశాలాధికారులు.)


౧

మంచినీళ్ల చెరువు అనుకునేరోడ్డు. దానినంటుకునే చలపతిరావుయిల్లు. చలపతిరావుకి యీమధ్య షష్ఠిపూర్తి మహోత్సవం, వారిఅబ్బాయికి బాలసారెకూడా జరిగాయి. బహుపిసినాసి. తాను కడుపుకి తినలేడు, ఒకళ్ళకి పెట్టలేడు. అతనికో మేనగోడలు. ఆపిల్ల పేరు శాంత. శాంత తల్లిదండ్రులు చిన్నప్పుడే పోవడంనుంచి అతనివద్దే పెరుగుతోంది. శాంత బహు అందకత్తె అని గట్టిగా చెప్పలేకపోయినా, అనాకారిమట్టుకు కాదని ఘట్టిగా చెప్పొచ్చు. చామనచాయగా అంత పొట్టీపొడుగు కాకుండా సన్నగా వుంటుంది. రజస్వలై రెండు సంవత్సరాలైంది. కాని యింకా కన్యే.

చలపతిరావుది మూడంతస్తుల మేడ. బట్టలవ్యాపారంచేస్తూ బాగా ధనం ఆర్జించాడు. శాంత ప్రతినిత్యం సాయంత్రంవేళ ఆమేడ మూడో అంతస్తుమీద కెళ్ళి గాలిపతాలు ఎగురవేస్తూవుండేది. అందులో శాంత బాగా ఆరితేరింది. చలపతిరావు యింటికి ఫర్లాంగు దూరంలో మరోపెద్ద మేడవుంది. ఆయింటాయన ప్లీడరు. ఆమేడకూ యీమేడకూ మధ్యగలవన్నీ సాదా పెంకుటిళ్ళే.

ప్లీడరు కొక కొడుకు, యిద్దరు కుమార్తెలు. కుమార్తెలు కాపురంచేస్తున్నారు. కొడుకు శంకర్రావుకి యింకా పెళ్ళికాలేదు. కాలేజిలో బి. ఏ. చదువుతున్నాడు. షుమారు యిరవై ఒక్క ఏడుంటుంది. కాని అతనికికూడా యీ ఆటంటే సరదాయే. కాలేజీనుంచి రావడం తడవుగా ఇదేపని. మనుష్యులను బాగా పోల్చలేకపోయినా కట్టుకున్న బట్టలరంగునుబట్టి మొగవాడో ఆడదో మట్టుకు పోల్చుకోవచ్చు ఆరెండు మేడలమీద నుంచుంటే.

గాలిపతాలపందెం ప్రతినిత్యం అక్కడ జరుగుతూవుండేది. శాంత గాలిపతాన్ని తరుచు శంకర్రావు పట్టేసుకుంటూవుండేవాడు. శాంతకు యిందులో ఎంత నేర్పున్నా శంకర్రావు పతాన్ని తనవశంచేసుకోడానికి ఎందుచేతో శిగ్గుపడేది. వీరిరువురి గాలిపతాలు ఎలాకలుసుకుంటున్నాయో అలాగే వీళ్లు కూడా కలవడానికి యోగం వుందేమో!

౨

ఆరోజే వచ్చింది. ఆనాడు సాయంత్రం షుమారు ఆరున్నరగంటలకు అప్రయత్నంగా సమీపంలోవున్న ఒక ఆలయంలో కలుసుకున్నారు. చూపుల పలకరింపే జరిగింది. శాంతవస్తుందని శంకర్రావుగాని, శంకర్రావువస్తాడని శాంతగాని అనుకోలేదు. ఒకరినొకరు 'నిన్ను నే నెరుగుదునులే' అన్నట్లు మౌనంగా లోపలికి వెళ్ళిపోయారు. అర్చకుడిచ్చిన తీర్థం, ప్రసాదం వగైరా తీసుకుని శంకర్రావు ముందు పైకొచ్చి అర్చకుడిచ్చిన పువ్వు వాసనచూస్తూ ఎవరికోసమో నిరీక్షిస్తున్నట్లు నిలబడ్డాడు. మరో అయిదు నిముషాలు పోయేసరికి శాంత తనముందునుంచే వెళుతూ వుండడం చూచాడు. పలకరించ

కుండా వుండలేక పోయాడు. కాని పలకరించడానికి విషయం ఏమీ స్ఫురించడంలేదు. సరే ఏమైతే అయిందని గుండె నిబ్బరంచేసుకుని, పలకరించడమే ప్రధానంగా యిలా అడిగాడు 'మీమేనమామ బట్టల షాపు ఎత్తేస్తాడటగా! ఎందుచేత ? లాభంలేదా ఏమిటి ?'

శాంతి సిగ్గుచేత తలవంచేసింది. జవాబివ్వడమా, మానడమా ? ఇస్తే తనస్త్రీత్వానికి పరపురుష సంభాషణ కూడదనిపని. జబాబు యివ్వకపోతే అతన్ని అగౌరవ పరచినట్లు. మూర్ఖస్త్రీగా అనుకుంటాడు. ఏంచేయుడమూ అని యింకా ఆలోచన పూర్తిచేయక ముందే శంకర్రావు 'పోనీలే ఆ గొడవ మన కెందుకుగాని నీగాలిపటాలు ప్రతిరోజూ నేను పట్టేసుకుంటున్నానని నీకు కోపంగాబోలు! క్షమించాలి. నాకదోఆనందం' అంటూ నడుస్తున్నాడు మెల్లిగా శాంతను సమీపిస్తూ.

'కోపం దేనికి ? ఎప్పుడో ఒకప్పుడు ఆపని నేనూ చేస్తాను. చేతకాక వూరుకోలేదు యింతవరకూ. రేపునేను పట్టుకుని తీరతాను చూడు' అన్నది స్నేహభావంతోను, విప్పారిన నేత్రాలతోను. శాంత తెలివైంది. అందమైంది వయస్సులోవుంది. శంకర్రావు చదువుకుంటున్నాడు. యవ్వనంలో వున్నాడు.

ఇంటికి కొంచెందూరంలోనే యిరువురు విడిపోయి ఎవరియిళ్ళకు వాళ్లు వెళ్ళిపోయారు.

## ౩

శంకర్రావు రాత్రి పుస్తకాలు తీశాడుగాని ఎక్కడా చదువు వంటబట్టేట్లుగాలేదు. ధ్యాస్నం వుంటే గదూ! పొరుగునేవున్న తన స్నేహితుడగు రామారావుని పిలిచి అప్పటికి జరిగిన సంగతంతా చెప్పి తన ఉద్దేశంకూడా ఎరిగించాడు.

'ఒహో! ఆపిల్లా!! నాకు తెలుసు. నీకు తగిందే. కాని ఆదుర్మార్గుడు నీకిస్తాడా? వాడే వూరికి అదర్శపురుషుడు. పేరుపడ్డ పిసినిగొట్టు. అసలు ఆపిల్లకు కడుపునిండా తిండిబెట్టి మంచి బట్ట యిస్తున్నాడో లేదో నాకనుమానమే. నీకెలా కనబడింది? సరే. నీకు ఉద్దేశము పుట్టినప్పుడు. ఎందుకు వూరుకోవాలి ? చల్లగా ప్రయత్నిద్దాం' అని ధైర్యంచెప్పి వెళ్ళిపోయాడు.

## ౪

మరునాడు మామూలుగా శాంత తనగాలిపటంవదిలింది. స్టాటుడ్రెస్సుమీదనున్న శంకర్రావు తనది వదిలాడు. ఒకరి దొకరు పట్టుకోవాలని ప్రయత్నాలు బాగా జరిగాయి. శంకర్రావు గాలిపటం పచ్చరంగుది. శాంతది గులాబీ రంగు. ఈ రంగులలోనే వీళ్ళగాలి పటాలు ఎప్పుడూవుండేవి. కనుకనే చప్పున పోల్చుకోడానికికూడా వీలయేది. శాంత ఎలాగైనా తనగాలిపటం పట్టుకుంటే బాగుండునని అనుకుంటూ సమీపంగానే వదిలేవాడు. శాంతకు యీపని అసహ్యం వేసింది. తననేమో చేతకానిదానిక్రింద భావిస్తున్నట్లు వూహించింది. పట్టుకోడానికి వీలుగానున్నా పట్టుకోకుండానే అనేకమారులు వదిలేసింది. కాని ఏకారణంచేతో శంకర్రావుకూడా శాంత గాలిపటాన్ని పట్టుకోడం మానేశాడు. ఇందుకు కారణం ఏమైవుంటుందా అని బాగా ఆలోచించింది. ఎందుకిలా చేస్తున్నాడా అనుకుంది. ఏమైతే అయింది పట్టేసుకుందామని నిశ్చయించుకొన్ని తన గాలిపటం తాడు బాగావదిలి గప్పున శంకర్రావుదానికి తగిలించి తనవైపు తాడు జోరుగా లాగేసింది. శంకర్రావుకి కాదగ్గపనే జరిగింది. గాలిపటంకోసని ఒక కాగితం తగిలించివుంది. ఇదేమిటో చూద్దామని తీసింది. అందులో

'నిన్నరాత్రి మనం కోవెలలో కలుసుకోడం నాకు చాలాసంతోషంగావుంది. ప్రతినిత్యం యిలాగే కలుసుకోడానికి నామనస్సు కోరుతోంది. నీవంటే నాకెంతో యిష్టం. నిన్నుగూర్చి ఎన్నివిషయాలో తెలుసుకోవాలని అభిలాష. మనం శాశ్వతస్నేహితులుగా వుండడానికి అవకాశం ఏదైనావుందా? ఆశ పెట్టుకునే తిరిగి కలుసుకుంటాము గదా అనే ధైర్యంతో వున్నాను' అని వ్రాశాడు.

శంకర్రావును మేడమీంచే చూసింది శాంత. ఆమె ఏంచేస్తుందో ఆ ఉత్తరంచదివి అని కళ్లుముయ్యకుండా శంకర్రావు చూస్తున్నాడు. 'సరేలే' అన్నట్లు— తన సమ్మతిని

అగుపరచినట్లు, ఆశాగీతం పైకి ఎత్తి చూపింది.

౫

ఆనాడు చీకటిపడ్డ తర్వాత యిద్దరూ తిరిగి ఆలయంలో కలుసుకున్నారు. ఆఆలయంవెనుక ఒక చిన్న కోనేరు దానిచుట్టూ తులసి, అరటి, గన్నేరుచెట్లు, కూర్చోడానికి చిన్నచిన్న అరుగులు వున్నాయి. ఎవరూ ఉండరుగదాయని యిద్దరు అక్కడికి వెళ్లారు.

అక్కడ కూర్చుని ఎంతసేపో కాలేదు. అప్పుడే చలపతిరావు యొక్క దగ్గరచుట్టమే ఒకడొచ్చాడు. షుమారు నలభై ఏళ్లుంటాయి. అతనంటే శాంత కెంతో భయం, భయపడ్డంతా అయింది. చూసి చూడనట్లు అప్పటికి వూరుకుని యింటికి వెళ్ళి శాంతనుగూర్చి చాలా చెడ్డగా చెప్పాడు.

శాంత 'త్వరగా వెళ్ళిపోవాలి-యిక్కడ మరి నిలవడానికి వీలులేదు. ఆదుర్మార్గుడి కంటబడకుండా వుండాలని నేనెంతో అనుకున్నాను.' అన్నది. 'ఎందుకా తొందర?' అన్నాడు శంకర్రావు దగ్గరగా కూర్చొని. 'ఆవచ్చి యిప్పుడు చూచిన మనిషే నన్ను నిలవాకం చేస్తాడట. నాకిష్టంలేదని ఎంత మొత్తుకున్నా మామేనమామ వినడంలేదు. ఇప్పటి నా యీచర్య అంతా తప్పకుండా చెప్పేస్తాడు. నాకు చీవాట్లు తప్పవు. వదిలేయ్. పోతాను. వీలైతే మరోదఫా కలుసుకుందాము' అని గబగబ అడుగులు వేసింది.

'అతను నిన్ను చేసుకోకుండా వుండేటట్లు చేస్తే నీవు నన్ను చేసుకుంటావా?' అన్నాడు.

తన సమ్మతిని కళ్ళద్వారా చూపెడుతూ వెళ్లిపోయింది.

* * *

ఇంటివద్ద శాంతకు చీవాట్లు కాలేదుగాని, తనయెడల మేనమామ కొంచెం కోపంగా వున్నట్లు గ్రహించింది. కాని తనపనిమట్టుకు మానలేదు.

౬

యథాప్రకారం సాయంత్రం అయిదుగంటలవేసరికల్లా గాలిపతం ఎగురవేయడం సాగించింది. ఆనాడు గాలిపతం వదిలేముందు దానికో చీటీవ్రాసి తానే తగిలించింది. అందులో

'ఇటుపైని మనకెట్టి అవకాశం వుండదు. ఇలాచూసుకుని, అలా కలుసుకోడానికైనా వీలు చిక్కుతుందో లేదో. గతరాత్రంతా నిద్రపట్టిందికాదు. మామేనమామ నిన్న మనం చూసిన ఆయనకు నన్ను యివ్వ నిశ్చయించి మరి మూడు నెలలకు వివాహముహూర్తము ఏర్పాటుచేశాడు. నాబ్రతుకిలావుంది. ఇంకేం కానైవుందో...

—శాంత'

శంకర్రావు శాంత గాలిపతాన్ని పట్టుకున్నాడు. అందులో విషయాలు చూశాడు. నిశ్చేష్టుడై నిలబడిపోయాడు అయిదునిముషాలపాటు. మా ఆశాలతను మొదట్లోనే మొదలంటా తుంచివేయడానికి వీడెక్కడ దాపరించాడూ అని విచారించి తిరిగి తనోలేఖ వ్రాసి తన గాలిపతానికి తగిలించి నా దీమారు పట్టుకోఅన్నట్లు శాంత తను చూసి వదిలాడు. శాంత మరో గాలిపతాన్ని వదిలి చులాగ్గా పట్టేసుకుంది. శంకర్రావు అందులో యిలా జవాబిచ్చాడు:

'నాప్రియమైన శాంతా!

భయపడకు. నీవెంత వేదన పడుతున్నావో నేను వూహించుకోగలను. నిన్ను రక్షించాలని నే నెంతో ప్రయత్నిస్తున్నాను. నేను చేయదగ్గ సహాయం తప్పకచేసి నాజన్మ సార్థకంచేసుకుంటాను. భగవంతుడు దయామయుడు. మన పాలిట అంత నిర్దయుడుగావుండడు. నీవెంతమాత్రం భయపడకు. నేను రమ్మన్నప్పుడు నాతో వెళ్ళిపోరావడానికి ఎప్పటికప్పుడు సిద్ధంగా వుండు...... ఇట్లు

నీ శంకర్రావు.'

అని ధైర్యంగా వ్రాశాడు. ఈ సంగతులు శాంత చదువుకుంటూ వుండేవేళకు చలపతిరావు వచ్చాడు. ఆఉత్తరం మరుగుపరచడానికి ఎక్కడా అవకాశం లేకపోయింది. ఎంతసేపై తనయొక్క యీ ప్రవర్తనంతా కనిపెడుతున్నాడో అని ఆపాదమస్తకం ముచ్చెమటలతో తడిసి చలించిపోతోంది.

చలపతిరావు తలపంకించి 'ఇదా సంగతి! ప్రతినిత్యం గాలిపతాల పేరుతో మేడఎక్కి ప్రేమలేఖలు

సంపాదించుకుంటున్నావా? నీసంగతంతా నేను కనిపెడుతున్నానులే' అని వీపుమీద నాలుగువేసి, లోపలకు లాక్కుని పోయాడు.

ఆరోజు లగాయితు శంకర్రావు, శాంతలకు కలయిక వ్యాగ్యమైపోయింది. కాని మేడలమీద నుంచి గాలిపతాలు ఎగురుతూనే వుండేవి.

## ౭

ఒకరోజు చలపతిరావు శంకర్రావుకు కనబడకుండా గాలిపటం వేశాడు. అది ప్రస్తుతం శాంతి ఎగురవేస్తావున్నదే. గనుక శంకర్రావేమైనా జవాబిస్తాడేమో అని చలపతిరావు నిరీక్షిస్తున్నాడు. ఆరోజున శంకర్రావు స్నేహితుడు రామారావు శంకర్రావువేషం వేసుకొని తాను ఎగురవేయడం ప్రారంభించాడు. శంకర్రావుస్నేహితుడు బహు తెలివైనవాడు ఎలాగైనా శాంతనుసంపాదించి శంకర్రావుకు వివాహంఅయేట్లు చూడాలనితలంపు. ఆతలంపుతోటే ఒక ఆలోచనచేసి శంకర్రావుతో ఇలా చెప్పాడు. 'ఇవాళ చలపతిరావు గాలిపతాలు ఎగురవేస్తున్నాడు. ఇంట్లో శాంత ఒకర్తే వుంటుంది. నేను నిద్రేస్సుతో గాలిపటం ఎగురవేస్తాను. నీవేగాబోలని చలపతిరావు అనుకుంటాడు. జవాబుకోసం నిరీక్షిస్తూకూడావుంటాడు. నీవు యీలోపున దాన్నితీసుకుని పెరటివైపునుంచి రైలుఎక్కి నీమేనమామగారింటికి వెళ్ళిపో. ఆక్వాత సంగతి ఆలోచిద్దాము.'

శాంతిమేనమామ గాలిపటాన్ని వదిలాడు. శంకర్రావుస్నేహితుడు తనది వదిలాడు. ఏదో జవాబిస్తాడని, యిదికూడా అధారంచేసుకుని బాగా కేకలువేయవచ్చునని చలపతిరావు అనుకున్నాడు. అనుకున్నట్లె రామారావు తనదానికి ఉత్తరం తగిలించి చలపతిరావుదానికి పట్టించాడు. చలపతిరావు ఆతురతతో ఆలేఖనుతీసి చదివాడు. అందులో

"నీవు ఇలా గాలిపతాల ఎగురవేతలమజా చేస్తావుంటే నీమేనకోడలూ శంకర్రావూ వాళ్ళవూరు వెళ్ళిపోతున్నారు. అక్కడ వాళ్ళిద్దరు భార్యాభర్తలు కాబోతారు. నీకు డబ్బుఖర్చులేనిపని. పాపం నీబంధువున్ని మరెక్కడైనా సంబంధం చూసుకోవాను. ఈపార్టీకి శాంతా శంకర్రావుగారు నిన్ను పిలుస్తారులే. అప్పుడు మరిచిపోకుండా వెళ్ళి మేనకోడల్ని, శంకర్రావుని ఆశీర్వదించు.

ఇట్లు, నేను."



భీమవరమునివాసులు
సుప్రసిద్ధాంధ్రచిత్రకారులు:
శ్రీయుత అంకాల
వెంకటసుబ్బారావుగారు


# నిద్రలేమి

దినమంతియు విశేషముగ పని చేయుటచే అలసట చెందిన నరములను నీవు విశ్రాంతి తీసికొను రాత్రిసమయమునసౌమ్యపరచి, వానికి తిరిగి బలము కలిగించి, క్రొత్త ఓజస్సునిచ్చి, పోయిన శక్తిని తిరిగి పూరించి, నీకు సుఖనిద్ర కలుగునట్లు చేయుటకు

# జీవామృతం

అమోఘమైన రసాయనము.

ప్రతిదినము పడుకకు చేరుటకు ముందు ఒకటి లేక రెండు స్పూనుల చొప్పున పుచ్చుకొనుచుండుచో అద్భుతముగ పనిచేయును.

మైమఱచినని ద్రయే మంచి ఆరోగ్యము.

మాన్యుఫ్యాక్చరర్లు:

## ఆయుర్వేదాశ్రమము

మదరాసు.

మీపాపలకు

వేలకొలదిగ తలిదండ్రులు భావించునట్లు పిల్లలే గొప్ప విలువగల సంపదగా మీరును భావించుచో వారు తమ ముద్దుబిడ్డలు బలారోగ్యములు కలిగియుండుటకు అవలంబించిన విధానమునే మీరును అవలంబించి వారివలె మీరును మీ పాపలకు

పండిత డి. గోపాలాచార్యులవారి

బాలభాస్కర

వలని లాభమును చేకూర్తురు.

ఏస్థితియందున్నను బిడ్డల లివర్ స్ప్లీన్ వ్యాధులను కుదుర్చుటకును, ఆటంకపరచుటకును బాలభాస్కర అమోఘమైన ఔషధము.

మాన్యుఫాక్చరర్లు :

ఆయుర్వేదాశ్రమము

మదరాసు.


చలపతిరావు ఆసంగతులు చూచి నిర్ఘాంతపోయాడు. కోపంతో ఆగాలిపటం అక్కడపారేసి యింట్లోకివెళ్ళాడు. ఇంట్లోశాంతలేదు. దానికితోడు ఆపిల్లనగలు, బట్టలువున్న పెట్టెకూడాలేదు. గుండెలుబాదుకుని గోలపెట్టాడు. శంకర్రావు యింటికి వెళ్ళాడు. ఆ అబ్బాయి ప్రస్తుతం యిక్కడలేడని, ఎక్కడికి వెళ్లాడో తెలియదని వాళ్లు చెప్పారు. అతనిబంధువు లందరికీ టెలిగ్రాంయిచ్చాడు. కాని ఎవరూ సరియైన జవా బివ్వారుగారు. ఇలా రోజులు, వారములు, నెలలు కూడా అయిపోయాయి.

౮

ఒకనాడు శంకర్రావుస్నేహితుడు చలపతిరావుషాపువద్దకు ఒకానొక రివిన్యూఅధికారియొక్క బంట్రోతువేషంతోవెళ్లి అధికారి హోదా తెలిపి షుమారు 25 లేక 30 రూపాయిల ఖరీదుగలవి నాలుగు చీరలు కావాలని, కొన్నిరకాల్ల చీరెలు ఇమ్మని కావలసినవి వుంచుకొని, మిగతావి సొమ్ముతో పంపించేస్తారని చెప్పాడు. అధికారి అడుగుతూవుంటే ఎలాలేదంటాడు? తీసుకెళ్లి మళ్లీ అరగంటలో మిగతా చీరలు- డబ్బు పట్టుకురావాలని చెప్పాడు. సరేనని శంకర్రావుస్నేహితుడు ఆచీరలుపట్టుకొనివెళ్లి శంకర్రావుకి యిచ్చాడు. శంకర్రావు శాంత కిచ్చాడు. శాంత అందులో మంచిచీర ఒకటికట్టుకొని వీటిడబ్బు యిచ్చేశారా అంది.

నీ కాసంగతంతా ఎందుకు అని శాంతకుచెప్పి, నీవాబట్టలషాపు అధికారిని యిక్కడకు తీసుకురా అని స్నేహితుడ్ని శంకర్రావు పంపాడు.

స్నేహితుడువెళ్లి చీరలుఅన్నీ వుంచుకున్నారని, డబ్బుపట్టుకెళ్ళడానికి రమ్మంటున్నారని అధికారి చిరునామా చెప్పాడు.

సంతోషంతో చలపతిరావు మంచిడ్రెస్సువేసుకుని శంకర్రావు యింటికి వెళ్లాడు. శంకర్రావు, శాంత యిరువురు ఒకటేబిల్ ముందు కూర్చుని ఫలహారంచేస్తున్నారు. శంకర్రావుస్నేహితుడు చలపతిరావు వచ్చాడని చెప్పడముతోటే లోపలకురావలసినదని ఆర్డరుచేశాడు. అణకువగా, చలపతిరావు లోపలప్రవేశించి వంగి నమస్కారం చేశాడు.

అలాకూర్చోవలసిందని కుర్చీ చూపెట్టాడు. చలపతిరావు గుమ్మైపోయాడు. తనుయిచ్చిన చీరగట్టుకుని శాంత ఎదురుగుండా కూర్చుంది. ఏమని పలకరించడమో చలపతిరావుకు తెలిసిందిగాదు. ఫలహారం, పళ్లువగైరా తెచ్చియిమ్మని శంకర్రావు ఆజ్ఞ చేశాడు.

ఇవన్నీ ఎందుకన్నాడు చలపతిరావు. 'మీ మేనగోడలు మీకు విందుచేస్తోంది. అంతే. ఇందులో నాదేంలేదు' అన్నాడు శంకర్రావు. అయితే 'మీయిరువురికి సంబంధం ఏమి'టన్నాడు. 'సంబంధంవుంది గాలిపటాలసంబంధంతప్ప' అన్నాడు శంకర్రావు నవ్వుతూ.

శాంత మేనమామకు నమస్కారంచేసింది. ఆశీర్వదించక తప్పింది గాదు. నాకయిష్టంగా వివాహం చేసుకోడమేగాకుండా, వందరూపాయల చీరలుకూడా తీసుకున్నారే అని లోపల చింతిస్తూ యింటికి వెళ్ళిపోయాడు, చలపతిరావు.